క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్‌ఆర్‌ఎం విభాగం అధిపతిగా ఆచార్య టి.శ్రీనివాస్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అధ్యాపకులు చీకటి శ్రీనివాస్, ఆకుతోట శ్రీనివాస్, సుచరితాపాల్ పాల్గొన్నారు.

డీఎంఈకి సన్మానం



కాజీపేట రూరల్ : కాజీపేట డీజిల్ లోకోషెడ్ సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ (డీఎంఈ)గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఎ.స్వరాజ్‌కుమార్‌ను మంగళవారం దక్షిణమధ్య రైల్వే కార్మిక్ సంఘ్ (డీఎంఆర్‌కేఎస్) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. డీఎంఆర్‌కేఎస్ సికింద్రాబాద్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.మోతీలాల్, డీఎంఆర్‌కేఎస్ డీజిల్‌షెడ్ బ్రాంచీ నాయకులు కలిసి బొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు.

వైద్యసాయం అందించాలి



దేశాయిపేట : వైద్య విద్యను పూర్తి చేసి సమాజంలోని పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. దేశాయిపేటకు చెందిన జన్ను యాహోషువా కూతురు జన్ను ప్రిన్సీకి ఇటీవల ఎంబీబీఎస్ సీటు లభించింది. ఫీజు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం వైద్య విద్యార్థినికి ఆర్థికసాయం అందజేశారు. పేదరికంలో ఉన్నా ఉన్నత విద్యలో సీటు సంపాదించడం అభినందనీయమన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంఘం ఎన్నికల షెడ్యూల్

హన్మకొండ చౌరస్తా : ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం పాలకవర్గం ఎన్నికల షెడ్యూల్‌ను ముఖ్య ఎన్నికల అధికారి ఎం.జయప్రకాష్ మంగళవారం ప్రకటించారు. గత పాలకవర్గం కాలపరిమితి మూడేళ్లు పూర్తి కావడంతో నూతన కార్యవర్గ ఎన్నికల తేదీని ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 23, 24 వ తేదీల్లో సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, అదేరోజు సాయంత్రం 5 గంటల వరకు ఉపసంహరణ, అభ్యర్థులు నామినేషన్లను హనుమకొండ కుమార్‌పల్లిలోని ప్రకాష్ ఫొటో స్టూడియోలో అందజేయాలని తెలిపారు. అక్టోబర్ 1న పోలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

భూమి పూజ

హసన్‌పర్తి: మండలంలోని వంగపహాడ్‌లో నిర్మిస్తున్న ఉమెన్ ఎంప్లాయిమెంట్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ భవనాన్ని మంగళవారం కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ ప్రారంభించారు. అమ్మ మైటీ హోమ్స్ ఆధ్వర్యంలో ట్రైనింగ్ సెంటర్‌ను నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అమ్మ మైటీ హోమ్స్ చేపడుతున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అమ్మ మైటీ హోమ్స్ చైర్మన్ గుడల్లి సుహాసిని, ఎస్సై అశోక్, పీఏసీఎస్ చైర్మన్ రాజేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చేప పిల్లలను కలిపిన సొసైటీ బాధ్యులు

కాజీపేట: మండలంలోని సోమిడి శివారులో ఉన్న పెద్దచెరువులో మంగళవారం మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడు సుంచు రఘురాం లక్ష చేప పిల్లలను వదిలారు. సొసైటీ సభ్యులతో కలిసి ప్రభుత్వం ఉచితంగా అందించిన చేప పిల్లలను నీటిలో కలిపారు. సుంచు నర్సయ్య, రామ్మూర్తి, సతీష్, సురేష్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించండి

నయీంనగర్ : అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం బొక్కలగడ్డలో రూ.35 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్, డ్రైయిన్ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు.కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

13న పోచమ్మ బోనాలు

కాజీపేట అర్బన్ : నగరంలోని 31వ డివిజన్ పరిధిలోని దీన్‌దయాల్‌నగర్ కాలనీలో ఈనెల 13న నిర్వహించనున్న పోచమ్మతల్లి బోనాలు నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ మామిండ్ల రాజు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



తేజస్వి స్కూల్‌లో పూలమాలవేస్తున్న చంద్రశేఖర్



హసన్‌పర్తి: గురువులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే



మామునూరు: హెచ్‌ఎం సత్యనారాయణను సన్మానిస్తున్న జోగిరెడ్డి

గురువు దైవంతో సమానం

గురువు దైవంతో సమానమని, సమాజంలో గురువుల పాత్ర కీలకం పలువురు వక్తలు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా మంగళవారం అన్ని స్కూళ్లు, కళాశాలల్లో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఫొటో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి జీవితంలో మొదటి స్థానం తల్లిదండ్రులదైతే రెండో స్థానం గురువులదేనని కొనియాడారు. ఉపాధ్యాయులు దేశ నిర్మాణానికి దిక్సూచి లాంటి వారన్నారు. అనంతరం ఉపాధ్యాయులను ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్



కేయూ క్యాంపస్ : విద్యాకళాశాలలో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్, తదితరులు



హన్మకొండ అర్బన్ : బన్ను న్యూరో హెల్త్ అండ్ రిహాబిలిటేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో..



మడికొండ : బోధన సిబ్బందిని సన్మానించిన జిల్లా మేనేజర్ జయశ్రీ



వరంగల్ : ఎస్‌ఆర్‌నగర్ పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రాజశేఖర్



కరీమాబాద్ : మల్లేశంను సన్మానిస్తున్న అధ్యాపకులు



హన్మకొండ అర్బన్: 450 పేపర్ల పై వేసిన రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద కళాశాల యాజమాన్యం



నయీంనగర్ : కిషన్‌పుర మాస్టర్ జీ స్కూల్‌లో..



దేశాయిపేట: లర్నర్స్‌ల్యాండ్ పాఠశాలలో..



హన్మకొండ : రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద..

ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం నిరసన



కరీమాబాద్ : రాస్తారోకో చేస్తున్న సీపీఎం నేతలు

కరీమాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం కరీమాబాద్‌లో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఉపాధిహామీ పథకం నిధులు కుదించడంతో కూలీల బతుకులు ఆగమ్యగోచరంగా మారుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రభాకర్, ఆలం, అప్పాజీ, వాణి, ఇస్మాయిల్, యాకుబ్‌పాషా, రాఘవరెడ్డి, సూరయ్య, రవీందర్ పాల్గొన్నారు.

హసన్‌పర్తి: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు గబ్బెట్ట సతీష్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, సారయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



హన్మకొండ: హనుమకొండ హౌజింగ్ బోర్డు కాలనీలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థిని, కవి, రచయిత నెల్లుట్ల రాసిన లావణ్య కుసుమ కవనాలు పుస్తకాన్ని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.మత్యాస్‌రెడ్డి, డైరెక్టర్ జి.సునీతరెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం రచయిత లావణ్యను, ఉపాధ్యాయులను సన్మానించారు.

దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే..

మామునూరు: సమాజంలో యువత బాధ్యతగా మెలగాలని, దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాంనాయక్ అన్నారు. విద్యార్థులు ఎన్‌సీసీపై అవగాహన పెంచుకొని ఇష్టంగా చేరి శిక్షణ పూర్తి చేస్తే పలు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని సూచించారు. ఖిలావరంగల్ మండలం మామునూరులోని పోలీసు శిక్షణ కళాశాల ఆడిటోరియంలో ఎన్‌సీసీ 10వ బెటాలియన్ వరంగల్ కమాండెంట్, కల్నల్ అజయ్‌నద కందూరి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం మంగళవారం ఐదో రోజుకు చేరుకుంది. సీతారాంనాయక్ మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణతోపాటు దేశభక్తి, సేవాభావం ఏర్పడుతుందన్నారు. సమాజంలో ఉన్నతమైన స్థానాన్ని కల్పించే ఏకైక ఉద్యోగమంటే కేవలం సైన్యంలో పనిచేయడమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఖమ్మం కమాండెంట్, కల్నల్ యాదవ్, కెప్టెన్ డాక్టర్ పి.సతీష్‌కుమార్, డాక్టర్ ఎం.సదానందం, రాధాకృష్ణ, సుహాస్ పదం, సొరస్య, ప్రవీణ్, రాజమాణిక్యం, వెంకటేష్, అనిత, సజ్జని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

వర్గీకరణ పోరాటానికి మద్దతివ్వాలి

హన్మకొండ : ఎస్సీ వర్గీకరణ పోరాటానికి రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకుడు వేల్పుల సూరన్న కోరారు. మంగళవారం బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్‌ను, నయీంనగర్‌లోని స్వగృహంలో కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డిని వేర్వేరుగా కలిసి ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఎంపీలు పార్లమెంట్‌లో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు జన్ను దినేష్ మాదిగ, గంగారపు శ్రీనివాస్ మాదిగ, మంద చిన్నరాజు మాదిగ, బొడ్డు శాంతిసాగర్ మాదిగ, చేతాళ్ల శివ మాదిగ, శనిగరపు రవీందర్ మాదిగ, రాజారపు కిరణ్ మాదిగ పాల్గొన్నారు.



వినయ్‌భాస్కర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

న్యాయవాదుల సహకార సంఘం సమావేశం



జ్ఞాపికలను అందజేస్తున్న జడ్జి రాధాదేవి

వరంగల్ లీగల్ : న్యాయవాదుల పరస్పర సహాయ సహకార సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం మంగళవారం సంఘం అధ్యక్షుడు కె.విజయభాస్కర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. కోర్టులోని అంబేడ్కర్ హాల్‌లో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు రాధాదేవి, కృష్ణమూర్తిలు హాజరయ్యారు. 2022–23 వార్షిక ఆర్థిక నివేదికను ప్రధాన కార్యదర్శి రాజ్ కర్నాకర్ ప్రవేశపెట్టగా చర్చల అనంతరం సభ్యులు ఆమోదించారు. సభ్యులు రెండుసార్లు డైరెక్టర్లుగా ఎన్నికైతే మరోసారి పోటీ చేయకూడదని తీర్మానించారు. బార్ అసోసియేషన్ల అధ్యక్షులు ఆనంద్‌మోహన్, శ్యాంసుందర్‌రెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు జయకర్, జనార్థన్, పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ సర్పంచ్, చెక్‌పవర్ సభ్యుడి మధ్య విభేదాలు

హసన్‌పర్తి: మండలంలోని నాగారం ఇన్‌చార్జ్ సర్పంచ్ అరుణ్, చెక్‌పవర్ సభ్యుడు రాజు మధ్య విభేదాలు పొడచూపాయి. చేసిన పనులకు సంబంధించిన నిధుల డ్రాలో జాయింట్ చెక్‌పై చెక్‌పవర్ సభ్యుడు సంతకం చేయడం లేదనే ప్రధాన ఆరోపణ. గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు చేసి రెండేళ్లు గడుస్తున్నా నిధుల విడుదల కోసం చెక్‌పై రాజు సంతకం చేయడ లేదని సర్పంచ్ అరుణ్ తెలిపారు. ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు పనులు పరిశీలించి ఎంబీ రికార్డులు చేశారని అరుణ్ చెబుతున్నాడు. చెక్‌పవర్ సభ్యుడు సహకరించడం లేదని స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్‌తో పాటు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు సర్పంచ్ తెలిపారు. అయితే ప్రతిపాదనల్లో పేర్కొన్న మేరకు పనులు జరగలేదని రాజు తెలిపాడు. పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ఆరోపిస్తున్నారు. నిధుల విడుదల విషయంలో చెక్‌పవర్ సభ్యుడు సహకరించడం లేదని నెపంతో అతన్ని బాధ్యతల నుంచి తొలగింపునకు మంగళవారం ఉదయం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీల్లో అందరు సభ్యులకు సమాచారం కూడా అందించారు. వార్డు సభ్యుల తీర్మానం మేరకు చెక్‌పవర్ సభ్యుడిని తొలగించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే చివరి క్షణంలో సమావేశం వాయిదా పడింది.

'తాళ్లపద్మావతి'లో కృష్ణాష్టమి వేడుకలు

కాజీపేట: మండలంలోని సోమిడి శివారులో ఉన్న తాళ్ల పద్మావతి ఒలంపియాడ్ పాఠశాల ఆవరణలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని బాలబాలికలు గోపిక, రాధాకృష్ణుల వేషధారణలతో చూపరులను అలరించారు. సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా నృత్య నాటికలను ప్రదర్శించారు. వేడుకలను పాఠశాల డైరెక్టర్ తాళ్ల వంశీ, చైతన్యలు ప్రారంభించారు. ఉట్టి కొట్టే ఆటను బాలబాలికలు ఉత్సాహంతో నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వేలు, అఫ్జలున్నిసా, దోమ మహేందర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతాల్లో శాశ్వత చర్యలు

హసన్‌పర్తి : లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపునకు గురి కాకుండా ఉండేందుకు శాశ్వత చర్యలు చేపట్టడానికి ప్రణాళిక రూపొందించినట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. ఇటీవల వరద ముంపునకు గురైన నగరంలోని 1వ డివిజన్ పలివేల్పులలోని బాధితులకు మంగళవారం నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఆమెజాన్, బాలవికాస సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు.

ఆర్థికసాయం

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో నిర్వహిస్తున్న టెండర్ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని వినాయకచవితి ఉత్సవాల నిర్వహణతో పాటు మృతి చెందిన వ్యాపారులు, హమాలీ కార్మిక కుటుంబాలకు ఆర్థిక సహాయంగా అందిస్తున్నామని ది వరంగల్ జిల్లా కూరగాయల మార్కెట్ కమీషన్ వర్తక సంఘం అధ్యక్షుడు జారతి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మార్కెట్‌లో వ్యాపారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో పని చేస్తూ మంగళవారం ఆత్మహత్య చేసుకున్న రైల్వే కార్మికుడు పులి రవికుమార్ కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేసినట్లు రెల్వే సీసీఎస్ డైరెక్టర్ డి.రాజ్‌కుమార్ తెలిపారు. పెద్దపెండ్యాలకు చెందిన రైల్వే సీసీఎస్ సభ్యుడైన రవికుమార్‌కు సొసైటీ నుంచి అందజేసినట్లు తెలిపారు.

ఎస్‌ఆర్‌ఆర్ తోటలో చెదారం తొలగింపు

ఖిలా వరంగల్: 33వ డివిజన్ ఎస్‌ఆర్‌ఆర్ తో టలో మంగళవారం పారిశుద్ధ్య సిబ్బంది గ్యాంగ్‌వర్క్ నిర్వహించారు. బల్దియా సూపర్‌వైజర్ సాంబయ్య ఆధ్వర్యంలో కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ పర్యవేక్షణలో ప్రధాన డ్రైనేజీల్లో పేరుకపోయిన చెత్తచెదారం పూర్తిగా తొలగించారు. భారీ వర్షాలు కురిసిన డ్రైనేజీలు పొంగిపొర్లకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు సూపర్‌వైజర్ సాంబయ్య తెలిపారు.

ఎఫ్‌సీఐ జీఎంను కలిసిన డైరెక్టర్

హసన్‌పర్తి: జాతీయ ఆహార సంస్థ సౌత్ జోన్ జీఎం జీ.ఎస్.రాజ్‌ను ఎఫ్‌సీఐ రాష్ట్రస్థాయి కౌన్సిల్ సభ్యుడు బూర సురేందర్‌గౌడ్ మంగళవారం కలిశారు.హైదరాబాద్‌లోని జీఎం ప్రధాన కార్యాలయంలో కలిసి బొకే అందజేశారు.

మదర్ థెరిస్సా సేవలు మరువలేనివి

దేశాయిపేట: ప్రపంచ శాంతిదూత మదర్‌థెరిస్సా దేశానికి చేసిన సేవలు మరువలేనివని వర్ధన్నపేట కాంగ్రెస్ నాయకులు డాక్టర్ జన్ను పరంజ్యోతి అన్నారు. నగరంలోని దేశాయిపేట రోడ్డులోని నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం మదర్ థెరిస్సా వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జన్ను అభిషేకం, కిషోర్, చింత ప్రకాష్, జెఆర్.సాల్మన్, అరుణాకర్, భాస్కరరావు, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'ఆశ'లను శాశ్వత ప్రాతిపదికన నియమించాలి

హసన్‌పర్తి: ఆశా వర్కర్లను శాశ్వత ప్రాతిపదికనపై నియమించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. హసన్‌పర్తి, సిద్ధాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట మంగళవారం ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు.

11న చలో హైదరాబాద్.

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఈనెల 11న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రాగుల రమేష్ తెలిపారు.

సోమిడిలో ఆశ వర్కర్ల ఆందోళన

కాజీపేట: మండలంలోని సోమిడి అర్బన్ హెల్త్ సెంటర్ ఎదుట మంగళవారం సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ఆందోళన నిర్వహించారు. అనంతరం వైద్యురాలు తిప్పారపు మధులతకు ఆశాలు వినతిపత్రం అందజేశారు.

వర్ధంతి సభను విజయవంతం చేయాలి

హన్మకొండ: ప్రజా ఉద్యమ నాయకుడు, హక్కుల నేత బొజ్జ తారకం 7వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జన్ను సాంబయ్య పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ వడ్డెపల్లిలో వర్ధంతి సభ కరపత్రాలను రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు విడుదల చేశారు.

అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

హన్మకొండ: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 20 ఏళ్లుగా పనిచేస్తున్న మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రవి, యూనియన్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు నద్దునూరి రాజేష్ ఖన్నా కోరారు. మంగళవారం బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు.

రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్య

కాశిబుగ్గ : రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ కాజీపేట రైల్వేస్టేషన్, ఎలుగూరు–నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంకు చెందిన సిరిపురం రాజేష్(35) వరంగల్ పోస్టాఫీసు సమీపంలో మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యం మత్తుకు బానిసైన రాజేష్ ఆర్థికపరమైన సమస్యలతో బాధపడుతూ నగరంలోని మేఘన బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న రైల్వే ట్రాక్‌పై డౌన్ లైన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గేటుపల్లి తండాకు చెందిన బాదావత్ బద్రు(39) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్య దివ్యభారతితో గొడవ పడి గత ఆరు నెలలుగా వేరుగా ఉంటున్నాడు. పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టిన భార్య కాపురానికి రా వడం లేదు. సోమవారం బద్రు తన అత్త ఇంటికి వెళ్ళి భార్యని కాపురానికి రమ్మనగా భార్య, అతని అన్న ఇద్దరు కలిసి బద్రుపై దాడి చేశారు. దాంతో తీవ్ర మనస్థాపానికి గురై ఎలుగూరు–నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య డౌన్‌లైన్‌లో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్‌ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ కేసు నమోదు మృతదేహాలకు పోస్ట్‌మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని సీఐ తెలిపారు.

ముదిరాజ్ మహాసభ మహిళా అధ్యక్షురాలిగా మాధవి



హన్మకొండ చౌరస్తా: తెలంగాణ ముదిరాజ్ మహాసభ వరంగల్ అర్బన్ మహిళా అధ్యక్షురాలిగా 7వ డివిజన్‌కు చెందిన పొన్నబోయిన మాధవి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బయ్య స్వామి, పులి రజనీకాంత్‌లు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా మంగళవారం మహాసభ అధ్యక్షులు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ చేతుల మీదుగా మాధవి నియామక ఉత్తర్వులను అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన పల్లెబోయిన అశోక్, శ్రీలతకు కృతజ్ఞతలు తెలిపింది.

రెండో రోజు కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన

కేయూ క్యాంపస్ : తెలంగాణలోని యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు అందరినీ రెగ్యులర్ చేయాలని కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోథ్, కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు

ఫాతిమానగర్‌లో మొక్కలు నాటిన 'జంగా'

కాజీపేట: 61వ డివిజన్ ఫాతిమానగర్‌లో మంగళవారం మదర్‌థెరిస్సా విగ్రహం ఆవరణలో డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మొక్కలు నాటారు.